2 ఆరంభింపరు....

శంకర్ చాలా అంబిషన్ గల యువకుడు. యం. యస్. పిం ఐనాడు. కాని వుద్యోగాలు లేవు. జర్నలిజంలో వినుతి కెక్కాలని అతని ఆదర్శం. భార్యని కాపరం చేయించమని తొందర చేస్తున్నారు అత్తవారు. తప్పదు. ఏదో ఓ ఉద్యోగంలో ప్రవేశించాలి. కాపరానికి డబ్బు అనేది అంత అవసరమైన విషయం యెందుకు కావాలా అని తర్కించుకుంటో వుంటాడు, అతని ముందు వరండాలో గింజల్ని ఏరుకుని యెగిరే పిచిక జంటవంక చూస్తో.

కేర్ఆఫ్ హిందూ ప్రకటన చూసి దరఖాస్తు చేశాడు. ఎవరికో ప్రైవేటు సెక్రటరీ కావాలిట. ఇన్టర్వ్యూకి రమ్మని ఉత్తరం ఒచ్చింది. యోగ్యతల్నిపట్టి జీతం నిర్ణయిస్తుందిట ఆమె. కవయిత్రి కారణ్ అనే పేరు చూసేప్పటికి అతని మనసు జలదరించింది. తనకే ఆ ఉద్యోగం దొరికి తేనా? కవయిత్రి, సుప్రసిద్ధ ప్రచారకురాలు, విద్యావతి, రూపవతి. యవ్వనవతి,స్వతంత్ర సమరవతి. దేశభక్తియుత ఉత్సాహవతి. ఆమెని దేశమంతటా ప్రతిసభలో ఉపన్యసించడానికీ, ప్రజల్ని యిన్స్పయర్ చెయ్యడానికి అహ్వానిస్తో వుంటారు. పత్రికల్లో ఆమె ఉపన్యాసాలు పెద్ద పెద్ద అక్షరాలతో

ప్రకటిస్తో వుంటారు. పత్రికలకి రాస్తుంది కూడాను. ఆమె భర్త కాంగ్రెసు ఉద్యమంలో జైళ్ళకి వెళ్ళి ఆరోగ్యం పాడై చచ్చిపోయి నాడు. అతని త్యాగం కూడా ఈమె నామధేయానికి ప్రకాశాన్నిస్తోంది. ఆమె సెక్రటరీకి పని భారంగానే వుంటుంది. కాని ఆమె మాటని దేశంలో శిరసావహించని నాయకుడు లేడు. ఇంగ్లీషు గవర్నర్లు కూడా ఆమెకి ఇన్‌టర్‌వ్యూలిస్తారు, జైలులో తొయ్యనప్పుడు. ఆమె ద్వారా దేశంలో యెవరితో పరిచయం కాదు తనకి? సరిగా తనకి కావలసిన ఉద్యోగం. తన జాతకం యెంతవరకు యోగించబోతోందో! ప్రకటనలో బాగా కష్టపడి పని చేయగల యువకులు మాత్రమే దరఖాస్తు పెట్టాలని వుంది. తన యావచ్ఛక్తిపీ వినియోగించి ఐనా ఆమె అనుగ్రహం సంపాయించాలి.

ప్రయాణం ఖర్చులకి అప్పుచేసి వెళ్ళాడు ఇన్‌టర్‌వ్యూకి. మద్రాసు సబర్బ్సులో పెద్ద తోట. పురాతన వృక్షాలకింద నడుస్తో మంచి బంగళా చేరాడు. నాలుగైదు కార్లు ఉన్నాయి బైట. జవాను అతను వచ్చిన పని అడిగి పక్క గదిలోకి తీసికెళ్లాడు అతన్ని. వరండాలో ఇంకా అయిదారుగురు యువకులు కూచుని వున్నారు. ఇద్దరు ముగ్గురితో ఇన్‌టర్‌వ్యూ అప్పుడే ఐనట్టుంది.

ఎదురుగా హాలులో కబుర్లు చెప్పుకుంటో కూచున్న పెద్ద మనుషులవంక చూస్తో పెద్ద గదిలో అర్ధచంద్రాకారం టేబిల్ ముందు సింహాసనంవంటి దిళ్ళ కుర్చీలో కూచుని వుంది ఆమె. ఆమె చీరె, జాకెట్, పారిస్‌నించి వొచ్చిన అతి విలువగల బట్టలు. అక్కడే చేసిన రవ్వల నాజూకు నగలు. ఉదయకాంతి కిటికీలోంచి కొంచెంగా యెదర గోడ మీద పడి ప్రతిఫలించి ఆమెని వెలిగిస్తోంది. రెండు పక్కలా పుస్తకాల వరసలు. బల్ల మీద కాయితాలు, పెన్నులు అన్నీ నవీన ఆఫీసు పరికరాలు. దూరంగా కిటికీ దగ్గిర సైపు చేస్తో ఒ అతను.

ఆమె శంకర్ని కూచోమనలేదు. అతని యోగ్యతల్నీ అనుభవాన్నీ ప్రశ్నిస్తో, నిర్భయంగా, చాలా తక్కువ మనిషిని చూస్తున్నట్టు యెగాదిగా చూసింది. అతని దరఖాస్తు మీద గావును ఏదో రాసుకుంది.

"ఈ రెండేళ్లూ ఏం వుద్యోగం యెందుకు చెయ్యలేదూ?"

"దొరక్క."

"ఎక్కడ దొరుకుతుంది? రోడ్ల మీదా? పడగ గదిలోనా?"

వెక్కిరింపు. ఉద్యోగం అంత అవసరం కాకపోతే జవాబు చెప్పును శంకర్రావు. వూరుకున్నాడు.

"ఏం ప్రయత్నం చేశావు?"

"ప్రయత్నం చెయ్యవలిసినచోటు కనపళ్ళేదు."

"ఎట్లా కనపడుతుంది, తండ్రి పెడుతో వుంటే తినేయువకులికి? మీవంటి వారి మూలనే దేశం ఇంత అద్ధాన్నంగా తగలపడుతోంది.

"ఉద్యోగం ఇస్తే రోజుకి ఎన్ని గంటలు పని చెయ్యగలవు?"

"అవసరమైనంతవరకు."

"ఎవరి అవసరం?"

"ఉద్యోగం అవసరం."

"ఏమిటా నంచోడం? అందుకనే యువకులందరికీ సైనిక శిక్షణ ఇవ్వాలని సలహా చేస్తున్నాను. స్వతంత్రమంటే సోమరితనం అని అర్థం యువకులకి. అధికారుల్ని యెదిరించడం. మీ కాలేజీలో అదేగా మీరు నేర్చుకుంటోంది?—

ఏయి రామన్! (టైపిస్టుని) ఏమిటా దిక్కులు చూడడం, కాపీ తొరగా-

"స్వతంత్రమంటే కృషి, కృషి. నడుములు వొంచి పని చెయ్యడం-రాత్రులు పగలు. నేను చూడు, యెన్నిగంటలు పనిచేస్తానో తెలుసా?"

అందుకనే అన్ని వజ్రాల నగలు అనుకున్నాడు.

కాఫీ తెచ్చాడు బట్లరు.

"మరిచిపోయినావు మళ్ళీ-కొత్తవాడు లెండి యీ బట్లరు. ఆ తలుపుమీద కొట్టి నేను రమ్మంటేనే గాని రాకూడదు. జీతాలు హెచ్చించాలి. లాభాలు పంచాలి. కాని పని మాత్రం సరిగా చెయ్యాలనే ధ్యాస లేదు. సరే పో-సరే లెండి, మీరు ఇక వెళ్ళండి."

"మా వూరు వెళ్ళనా?"

"మీ వూరుగాక యెవరి వూరు వెడతారు?"

"ఉద్యోగం?"

"ఏం? వాళ్ళందరూ పీక్కున్న తీసిపోయినారా? ఆలోచిస్తాను."

"ఎన్నాళ్ళల్లో తెలుస్తుంది?"

"ఏమిటా తొందర? మీ ముఖారవిందం చూడగానే, ఇంతకన్న ఇంకేం కావాలని, వెంటనే ఉద్యోగం ఇచ్చేస్తారని ఆశతో ఒచ్చినట్టుంది!"

అతను సిగ్గుపడుతో ఉద్యోగం ఇచ్చినా సరే, తనకి అఖర్లేదనుకుంటూ బయటికి వచ్చాడు. అసలు ఆ మాటలుగాక, స్త్రీచేత ఆ మాటలనిపించుకుని జవాబు చెప్పలేక పోవడం చాలా అతని అభిమానానికి గాయమయింది.

వరండా మెట్లు దిగుతో వుంటే—

'సర్' అన్నాడు వెనకాలే వచ్చి బట్లరు.

"ఇట్లా దయచెయ్యండి."

ఇంటి వెనుక పెద్ద గదిలోకి తీసికెళ్ళారు. ఇంతకు ముందు ఇన్‌టర్‌వ్యూ అయినవాళ్లు ముగ్గురు అక్కడ కాఫీ తాగుతున్నారు. అతన్ని కూచో మన్నారు.

చాలా అందమైన గది. టేబిల్, అన్నీ వెండి సెట్లు. ఇడ్లీ, దోసెలు, ఉప్మా, జిలేబీ, కాఫీ, టీ.

కావలసిన వాళ్ళకి అమ్లెట్లు ఇస్తా నన్నాడు బట్లర్. వాళ్ళు అతనితో మాట్లాడలేదు. తెలుగు వాళ్ళ లాగు లేరు. వాళ్ళ మాటలూ వినపడలేదు. గొంతెత్తి మాట్లాడ్డం భయంగా వుంది. అదేం మర్యాద! ఉద్యోగానికి వచ్చిన వాళ్ళకి యీ ఫలహారం. వెళ్లేప్పుడు అతని చేతిలోకవరు పెట్టాడు యింకో నౌకరు. రైలు ఖర్చులు అని రాసివుంది.

ఆ పెద్ద చెట్టకిందనించి నడుస్తో, ఆమెదగ్గర ఉద్యోగం కావడం కన్న ఇంకేం అదృష్టం వుంటుంది అనుకున్నాడు.

గేటు దగ్గర అతనికోసం చూస్తున్నాడు.

"శంకర్!"

3488 శ్రీకాకుళం

"నన్నెట్లా యెరుగుదువు?"

"నేను వీ జ్ఞాతిని. నువ్వు నన్నెరగవు" అని బంధుత్వం తెలిపాడు.

పాపం, ఆ యువకుడు చాలా పాలిపోయి క్షీణించి వున్నాడు. కాని ఉత్సాహం అతనిలో పోలేదు.

"ఏం చేస్తున్నావు ఇక్కడ?"

"నే నామెకి సెక్రెటరీ."

"నువ్వా!"

"నా స్థానాన్నే మీకు ఇన్‌టర్‌వ్యూలు. తప్పుకుంటున్నాను."

"చాలా చిత్రమైన మనిషిలాగుందే!"

యువకుడు వాచి చూసుకుంటున్నాడు.

"చాలా. కాని ఇది విను. నేను వెళ్ళాలి. ఆలస్యమైతే చంపేస్తుంది."

"సరేలే. చాలా ఎక్కువ పనా?"

"అబ్బే!"

"మవ్వెందుకు మానేస్తున్నావు?"

"అనారోగ్యం."

"ఓ-పాపం! ఏమిటి?"

"వాటన్నిటికీ వ్యవధి లేదు. చూడు, నీకు ఉద్యోగం ఇస్తానన్నా తీసుకోకు."

"ఏమి?"

"ఏం లేదు, అంతే!" అని వెళ్ళిపోతున్నాడు.

"పోనీలే, ఏం పోయింది! కష్టంగా వుంటే అప్పుడే మానేస్తాను."

"మానెయ్యలేవు, అదే వొచ్చిన కష్టం."

"సరేలే. మరి నువ్వు ఎందుకు అంత జబ్బుగా...."

"అదే. అదే. ఒప్పుకోకు."

"పోనీ ఉత్తరం రాస్తావా?" అన్నాడు వెంటబడి.

"ఎందుకు ఉత్తరం?"

"ఇక్కడి సంగతులు."

"అమ్మో! ఉత్తరమే! నేనేం రాయను, చెప్పను. ఉద్యోగం ఒప్పుకోకు. ఒప్పుకుంటే నా మల్లేనే ఐపోతావు. ఆమె చూస్తుంది. వెళ్ళిపో!" అంటో పరిగెత్తాడు.

నాలుగో రోజుకి శంకర్‌కి ఉద్యోగం ఆర్డరు వొచ్చింది.

నెలకి రు 150 జీతం. ఆమెతో తిరుగుతో వుండాలి. ఇన్‌టర్ ఛార్జీలు. రోజుకి మూడు రూపాయల భత్యం. కాని ఆమె కుటుంబంలోనే వుండవొచ్చు సంసారం లేకపోతే, అట్లా ఐతే రోజు భత్యం వుండదు.

ఆలోచించాడు. తన జ్ఞాతి చెప్పిన భయాలు తోసేసుకున్నాడు. రు 150 జీతం. ఈ జన్మకి తనకి యెక్కడ దొరుకుతుంది అట్లాంటి ఉద్యోగం? చివాట్లా? యెక్కడ తప్పుతాయి నౌకరీ అన్న తరవాత! మరి యెందుకు బెదిరించాడు తనని? ఏం? అంత బావుండక పోతే యెందుకు మానెయ్య కూడదు? పైగా ఆ హర్మ్యంలో వుండ వొచ్చుట. అదిగాక యెప్పుడూ ప్రచారమే ఐతే ఈ సంసారాన్ని ఎక్కడ పెడతాడు?

పాత ట్రంకు సద్దుకుని, చిరుగు జంపఖానా, మాసిన దిండు చుట్టుకుని బైలుదేరాడు ఆ రాత్రికే! వొస్తున్నానని టెలిగ్రాం ఇచ్చి, రైలు ష్టేషనులో ఆగింది. రైలు దిగి పెట్టా ట్రంకూ పట్టుకుని బస్సు కోసం నడుస్తున్నాడు. వెనకాలే వొచ్చి అతని సామాను తీసుకున్నాడు ఒక లీవరీడ్ షాఫరు. కారులో కూచో పెట్టి తీసుకుపోయినాడు.

ఆమె బంగళాలో ఓ పక్క గదిలోకి తీసికెళ్ళి ప్రవేశ పెట్టాడు. వెంటనే కాఫీకి పిలిచారు. భోజనాల గదిలో ఆమె కాఫీ తాగుతోంది. అతన్ని చూడగానే ఆమె నమస్కారం పెట్టింది. చాలా ఆదరంగా చిరునవ్వుతో కూచో పెట్టింది.

ప్రయాణం, ఇంటి దగ్గర వాళ్ళ యోగ క్షేమాలు అడిగింది. స్వయంగా అతనికి వొడ్డింప చేసింది అతని రుచులన్నీ తెలుసుకుంటో.

వూరి వెలపల బైరాగి వాడి మెళ్లో ఏనుగు పూల హారం వేసి

కొండంతో పై కెత్తి అంబారీ మీద కూచో పెట్టుకుంటున్నట్టు వుంది అతనికి. ఇంకో నలుగురు కాఫీ తాగుతున్నారు ఆ బల్ల దగ్గిరే.

"అబ్బా! ఆ బట్టలు విప్పకుండానే వొచ్చారా? ఏం చేస్తున్నాడు గోరాకుంభర్?"—అంటే వాడో చాకలి నౌకరు.

"మీ వూళ్లో అంతే గావును: యెట్లా తిరుగుతారు తెలుగు వాళ్ళు? ఒంటి మీద జాగ్రత్త లేనివాళ్ళకి పని మీద ఏముంటుంది?" అంది వెక్కిరింపుగా.

తల వొంచుకుని పోయింది అతనికి.

"ఏమిటా సిగ్గు? మొగ డివి కాదుటయ్యా! సరిగా చూడు. అదుగో. ఆ దోసె పారెయ్యడమేనా? అవాయిడ్ వేస్ట్. ఇండియా బీద దేశం"

"ఆ సంగతి ఈ ఇంటికి అర మైలు దూరంలో జ్ఞాపకంరాదు" అన్నాడు సహించలేక.

చాలా హాయిగా నవ్వింది, ఆ మాటని కాంప్లిమెంటు కింద తీసుకుని. ఆమెకి మెదడు తక్కువా? లేక అది చాలా నేర్పైన ఒడుపా?

"అవును. తినాలి. అనుభవించాలి. నాజూకుగా కోడిమల్లే తిండిని పొడుచుకుతినే వాళ్ళని చూస్తే అసహ్యం నాకు."

అతను గదిలోకి వెళ్ళాడు. క్రొత్త ట్రంకు ఎవరిదో పెట్టారు. ఎంత మంది సెక్రటరీలు ఈమెకి! అప్పుడే సామాను కూడా అమర్చుకున్నాడు బల్లమీద. తళతళ లాడే కొత్త షేవింగు సెట్. తల నూనె. దువ్వెనలు. అన్నీ.

గోరాకుంభర్ వొచ్చి స్నానానికి పిలిచాడు.

"నా బట్టలు?"

"ఆ పెట్టెలో వున్నాయి."

"నా పెట్టె?"

"పారేశాం."

మంచం, దాని మీద పక్క, తెల్లని దుప్పటి.

పైన ఫాన్.

"నా పక్క చుట్టు?"

"పారేశాం. షేవ్ చేసుకోండి, అవుగో."

"ఇవన్నీ నాకే?"

"ఆ."

క్షౌరం, స్నానం, బట్టలు, అన్నీ కాగానే, పిలుపు వొచ్చింది. మళ్లీ ఆమె ఆఫీసుగది. చీరెలు, నగలు అన్నీ మారిపోయినాయి. ఇంకో రంగులు, ఫాషన్‌లు. కూచోమంది ఈ సారి. ఆ టైపిస్టు అట్లానే వున్నాడు.

ఓ ఉత్తరాల కట్ట ఇచ్చి జవాబులు రాయమంది. ఏం రాయాలో ప్రతి ఉత్తరం మీదా పొడి మాటలలో రాసి వుంచింది అంతకుముందే.

"అవి సరిగా రాసి నాకు చూపండి. తరవాత ఫెయిర్ కాపీ చేద్దురుగాని, అతను టైప్ చేస్తాడు. రెండురోజుల్లో గోరక్షణమీద పావుగంట ఉపన్యాసానికి నోట్సు తయారు చెయ్యండి రేడియోకి. లైబ్రరీ చూపిస్తారు. మీకు కావలసిన ఇన్‌ఫర్మేషన్ అక్కడ దొరుకుతుంది" అంది.

మళ్లీ భోజనం ఆమెతోనే. ఆ టైపిస్టు కూడా. ఎవరో ఇద్దరు కొత్త అతిథులున్నారు. ఆమె ఒకటే మాట్లాడుతోంది. కాని ఎవరూ గట్టిగా ఎదురు చెప్పడానికి వీల్లేదు. చెప్పనీదు. ఎక్కిరింపుతో, లేక ఉపేక్షతో నోరు మూస్తుంది. తనైతే నౌకరు. వాళ్లెందుకు లొంగి పోతారో అతనికి అర్థంకాలేదు. ఆమె ధారమో లేక పర్సనాలిటియో అనుకున్నాడు. ఏ పని గాని ఆ ఇంటో చాలా నిక్కచ్చిగా జరగాలి. అందుకని తనకోసం, తన అతిథుల కోసం, సెక్రటరీల కోసం, అరుస్తో వుంటుంది. ఆమెకి స్నేహితురాలే గాని బంధువులు ఎవరూ లేనట్టుంది. ఉంటే చేరనియ్యదో.

మధ్యాహ్నం నించి టైలరు ఒచ్చి అతని కొలతలు తీసుకున్నాడు. మర్నాడు స్నానం చేసి ఒచ్చేప్పటికి అతని బల్లమీద రిస్టువాచి, ఖరీదైన కలం. పెట్టెలో బట్టలు తనవి కావు. సేలం అంచు పంచలు. సిల్కు లాల్చీలు, జరీ గోరంచు కండువాలు. అన్నీ ఒకే రకం. ఇదేం దయా! ఈ బలవంతం?

కాని డ్రెస్ చేసుకుని చూసుకుంటే, తన ఒంటి తీరుకి, ముఖానికి సరిగా ఎటువంటివి సరిపోతాయో, ఏవి స్టేటస్నీ, అందాన్నీ, చిక్‌నీ ఇస్తాయో సరిగా ఆ బట్టలు అవి.

రాత్రి భోజనం దగ్గిర థాంక్ చేశాడు ఆమెని. "ఎందుకు థాంక్సు? నీ కోస మనుకున్నావా ఏం! నా సెక్రటరి కోసం. నా సెక్రటరీని చూసి నా మీద గౌరవం రావాలి."

అంటే తనకి లివరీ అన్నమాట-కారు షాఫర్కి మల్లే.

ఆమె లైబ్రరీ చాలా గొప్పది. ఎన్ని నవలలు, చరిత్రలు, కవిత్వాలు! పైగా బట్టలు లేని బొమ్మల పుస్తకాలు! ఎంత ఖరీదో అవి!

ఆ టైపిస్టు తనని కలుసుకోడు,ఎప్పుడోతప్ప."ఎంత వైభవం! ఏమిటి ఇంత సంపద?" అన్నాడు శంకర్.

"ఆమె కేం? భర్త నాలుగు లక్షలు వొదిలాట్ట. పైగా బోలెడు సంపాదన, అనుభవిస్తోంది హాయిగా."

ఆ రాత్రి రాజకుమారుడి మల్లే పడుకున్నాడు, కిటికీ లోంచి తోటలో ఫౌంటైన్ నీళ్ళలోంచి మెరిపే వెన్నెల వంక చూస్తో. ఆస్ట్రేలియన్ శికాయ, కస్తూరి, తుమ్మపూల పరిమళాల్ని అనుభవిస్తో.

తెల్లారిందంటే—

వూరికే అట్ల తెల్లారిందంటే బాగాలేదా? ఇదేం చలం కథ అనుకున్నారా?

మర్నాటి నించి అతన్ని ఆమె పనులు చెప్పి వూళ్ళోకి పంపుతోంది. మినిస్టర్లు, రేడియోవారు, పత్రికాధిపతులు, రాజ్యాంగ సభ్యులు, ఒక రేమిటి?

"ఎక్కడికి వెళ్ళినా కారులో వెళ్ళండి."

"కా రెందుకు?"

"మీ కోసమా! పని కావడం ప్రధానం. నువ్వూ కాదు. నేనూ కాదూ, ఆ ఇరవై వేల రూపాయల కారు పనులు సాధిస్తుంది, కాని సంవత్సరం కాలేదు, నాకు యాభై వేల రూపాయలు సంపాయించి పెట్టింది అది" అని పెద్ద నవ్వు నవ్వింది.

అంత స్పష్టమైన.కాపట్యం లేని మనసు వుంటుందా అనిపించింది అతనికి అట్లాంటామె నాలుగు మాట లంటేనే? భరించడం నామర్దా కాదనుకున్నాడు.

పది రోజుల్లో పర్యటన కై బుదేరారు. నౌకర్లూ, కారూ, నాసీ శంకర్, ఆమె సిబ్బంది. దేశమంతటా ఉపన్యాసాలు ఇన్‌టర్‌వ్యూలు ఆహ్వానాలు-దిగ్విజయం చేసి మూడు నెలలకి తిరిగి వొచ్చారు. ఆ ప్రయాణం భారమంతా శంకర్ మీదనే పడింది. అన్ని చిన్న విషయాలు చాలా జాగ్రత్తగా చూడాలి. రైల్లో బర్తులు కారు జాగ్రత్త, భోజనం, మీటింగుల ఏర్పాట్లు, పత్రికల్లో ఆమె ఫోటోలు, న్యూసు, ఆమె ఉపన్యాసాలకి నోట్సు, అతను సమర్థతతో నెరవేర్చాడు చాలా కష్టపడి. ఏ మాత్రం లోటు వొచ్చిన చాలా చురుకైన చివాట్లు. బాగా చేసినప్పుడు చాలా మెచ్చుకునే మాటలు, చిరు నవ్వులు, దయ. ఆమె పొరపాట్లనీ అంత ఉదారంగానే ఒప్పుకుంటుంది. న్యాయమే ననిపించింది అతనికి. ప్రతిదానికి 'శంకర్, శంకర్' అని అందరి ముందూ అతన్ని పొగుడుతుంది. అతను లేకపోతే తన పని సున్నా అంటుంది. తన ఉపన్యాసాల గొప్పతనం కొంత అతని కాపాడిస్తుంది. ఏమన్నా లోపం జరిగితే అందరి ముందూ అతన్ని దివాలా తీస్తుంది.

మీటింగుకి పావుగంట ఆలస్యంగా వెళ్ళింది ఆమె. అతని తప్పు అంది కారులో. అతన్ని దగ్గిరగా తన పక్కనే కూచో పెట్టుకుంటుంది.

ఉపన్యాసం ప్రారంభిస్తూనే-

"ఆలస్యానికి క్షమించాలి. నన్ను కాదు, ఎంత నేర్పినా లాభం లేని బుద్ధిరాని నా సెక్రటరీ శంకర్ని" అని. (నవ్వులు) చచ్చి పోయినాడు అతను. ఆమెతో వెడుతో వుంటే ఒక్కొక్కసారి ఆ గౌరవా లన్నిటికీ తనే అధిపతి ననిపించేది. కాని చాలా సార్లు ఆమె పెంచుకుని, వేషం వేసి తిప్పుతున్న కుక్కని అనిపించేది. ఏ నిమిషాన కారు ఆపి, "పో, దిగిపో" అని తోసేస్తుందో అని భయం. తిట్టిందా మర్యాదగా తిట్టదు, బూతులకి అట్టే దూరం లేదన్నట్టు హీనంగా తిడుతుంది.

చాలా మంది శంకర్ని ఆమె ప్రియుడు అనుకుంటున్నట్టు తెలుస్తోంది అతనికి. చాలా మందికి వేళాకోళం. చాలా మందికి ఈర్ష్య. మిత్రులకి తను చాలా అదృష్టవంతు డనుకుంటున్నారు.

అతని జీతం ఇప్పుడు మూడు వందలు-అతను ఏ మాత్రం అడగకుండానే. అతనికే కాదు.- ఏ నౌకరు కష్టపడి ఆమెని మెప్పించినా, ఆమె ఉపకారం చెయ్యడానికి అంతు వుండదు.

ఆమెని చూస్తే-ఆమె చిన్న వొళ్లూ, తెల్లని రంగూ, నాజూకైన ముక్కూ, అరచేతులూ చూస్తే ఎవరికైనా ఆమె ప్రేమ కోసం పుట్టిందనిపిస్తుంది. కాని అదేం కనపడదు. ఇష్టమైన వాళ్ళతో చాలా చనువుగా వుంటుంది. కాని అంతవరకే.

అతనికి ఆమె మీద చాలా ఇష్టం. కాని ఆమె వెక్కిరింపుల వల్లనో, చివాట్ల వల్లనో, ఆమె మీద నిలపలేని కోర్కె కలగదు. కాని ఆమె పడకటింటి మిత్రు లెవరా అనే కుతూహలం మాత్రం వుంది.

ఆమెకీ అతనితో చాలా చనువు. ఇష్ట పడదంటే ఆమె ఇంక సంకోచంలేకుండా మనసిస్తుంది. ఐతే వాళ్ళు ఇద్దరు ముగ్గురు కన్న ఎక్కువ లేరు. తను కలుసుకున్న వాళ్ళ శరీరాల్ని మర్మం లేకుండా వర్ణించి నవ్వుతుంది. ప్రతి వాడిని గురించి తూలనాడుతో లెఖ్ఖ లేకుండా మాట్లాడుకుంది. వీలైనంత వరకు ఏ మాటంటే ఆ మాట అనేస్తుంది. వాళ్ళేమన్నా అంటే వినిపించుకోదు. తన మీద తృణీకారం చూపితే తప్ప, తనని ఎన్ని మాటలన్నా నవ్వేస్తుంది. ఎదురంటుంది.

ఒక రాత్రి భోజనం దగ్గిర సంభాషణ ప్రేమ మీదికి తిరిగింది.

ఆమెకి అప్పుడప్పుడు సూచనగా ప్రేమ లేఖలు కూడా వొస్తాయి. జవాబుకి వాటిని అతనికే ఇస్తుంది. ఆమె కసలు ప్రైవేట్ కరస్పాండెన్స్ లేనే లేదు. ఆమెతో పరిచయమై ఎన్నాళ్ళకీ ఆమె దగ్గర చేర లేక, కొట్టుకుని, కోపించే మనుషులు చాలా మంది ఉన్నట్టున్నారు. హద్దుమీరడం అసంభవం. ఎంత ఒంటరిగా, చనువుగా, ఎన్నాళ్ళు ఆమెతో వర్తించనీ, ఆమెతో మోహ సంబంధంగా ఏ

కొంచెం దగ్గిరిగా కూడా రావడానికి ఎవరికీ గుండెలున్నట్టు కనపట్టం లేదు. కాని అమితంగా అమె ఆశలు రేపుతున్నట్టు కనిపించింది శంకర్ రావుకి, మరి అందం, ధనం, ఐశ్వర్యం-ప్రపంచంలో కల్లా వాంఛనీయమైన విషయాలు అమెలో మూర్తీభవించాయి. పైగా అమె నీతి, మర్యాదా ఓ లేఖ్కగా ప్రవర్తించదు. మాట్లాడదు. నీతి పరుల్ని, నీతి వేషాల్ని చీల్చి వెక్కిరిస్తుంది, మనుషుల మొహాల మీదే. "దగ్గిరిగా కూచోండి. ఏమిటా దొంగ మర్యాదలు! ఇంతలో నాతో పడుకుంటున్నారని అనుకోరు లెండి" అంది ఓ మంత్రిగారిని.

అట్లా మాట్లాడే శృంగారవతికి ఏం జవాబు చెపుతాడు పురుష మాత్రుడు?

అమె భర్త సంగతి ఎప్పుడూ ఎత్తలేదు అమె. చూసిన కొద్దీ ఎడ్మిరేషను ఎక్కువౌతోంది శంకర్రావుకి.

ఆ ప్రేమ లేఖలకి జవాబుల్లో చాలా చమత్కారంగా తప్పుకుంటుంది. ఏమీ కాదనదు. ఔననదు. ఆ ఉత్తరంతో ప్రేమజాడ్యం కుదిరిపోతుంది.

"దానికేం? అట్లానే కలుసుకుందాం! ఏమిటో! మీ వాత్సల్యం వల్ల అట్లా అంటారుగాని నాలో ఏముంది? ప్రేమకేం? ఇదివరకు లేదు గనకనా, ఇంక ముందు ఏదో కావాలనడం?"

అట్లా రాస్తుంది. అతనికే తెలిసిపోతోంది ఏ ఉత్తరానికి ఏం జవాబు రాయాలో!

"ప్రేమ! ప్రేమ! ఏం గొప్ప మాట! వీళ్ళందరికీ ప్రేమ! వీళ్ళ మొహాలకి! ఓసారి మరి అద్దం ముందు సరిగా నుంచుని చూసుకో కూడదూ?" అంటుంది అతనితో.

అమె వొంటికేకాక, డబ్బుకీ వేస్తో వుంటారు ఎత్తులు, అప్పులనీ, వ్యాపారాలనీ. ముందే తెలుస్తుంది గావును అమెకి. డబ్బెవరికి కావాలో, తను ఎవరికి కావాలో, రెండూ ఎవరికో.

"రేపు బహుశా అప్పడుగుతాడు" అంటుంది-ఎవరి ద్వారానో పరిచయం చేసుకుని కారులో వొచ్చి అమెని మాటలతో రంజింప చేసినవాణ్ని.

ముందే అన్నీ తెలుసుకు రమ్మంటుంది శంకర్ని. తన అప్పుకి మంచి వాడ్డీ, షేర్లకి సరైన లాభం వొచ్చేట్టు కనపడితే, చాలా ఉదారంగా వూరికేనే ఆ మనిషి మాట విలువ మీదే ఇస్తున్నట్టు ఇచ్చేస్తుంది, దానం చేసినట్టే. లేకపోతే "ఎక్కడ వుందండీ డబ్బు? చాలా ఖర్చుగా వుంది" అంటుంది.

ఈ పెద్ద పెద్ద బిజినెస్ మనుషులూ, రాజకీయ ధురంధరులూ ఆమె ముందు వుత్త వూక. కాని ఆమె మాటలూ పద్ధతీ, గోములూ మాత్రం ఏం తెలీని అమాయికపు నిస్సహాయపు స్త్రీవి. ఎంత పేపు ఈమెని మోసగించడం, మోహించడం అనుకునే వాళ్ళకి చాలా గట్టి బొప్పెలు కడతాయి. కాని బహిరంగంగా విరోధించడానికి ఏమీ కారణం కనపడక, తమదే తప్పనుకుని స్నేహంగా వుండిపోతారు.

ఆ రాత్రి భోజనం దగ్గిర ప్రేమ ప్రస్తావన వొచ్చింది, కవిత్వ చర్చ ద్వారా. ఏ చర్చ వొచ్చినా ఉన్నత వాతావరణంలోనే జరుగుతుంది ఆమె ముందు.

ఆమె భోజనం ఏర్పాట్లు కూడా ప్రత్యేకం. గుడ్లు తప్ప శాకాహారి. పెళ్ళి కాని అయ్యంగారు స్త్రీకి పుట్టి తెలుగు నాయుణ్ణి పెళ్ళి చేసుకుంది అంటారు కొందరు. వంట-కాయ కూరల్లే, కాని దాన్ని చూపి వంకాయకూర అనుకోము. తిన్న తరువాత కూడా కొంత పేపటివరకు తెలీదు. పులుసు కలిపి అన్నం ప్లేట్లలో ముందు పెడతాడు బట్లరు. పెరుగూ కలిపే. మజ్జిగ తాగడానికి ఇస్తారు. ప్రతి పదార్థానికీ నిర్ధారణగా చెప్పలేని కొత్త పరిమళాలు వుంటాయి. ఆమె భోజనానికి పిలిస్తే యెవరికన్నా అదొక గౌరవమే కాదు, అదొక శృంగారానుభవం. ఆమె పిలవంది మాత్రం ఆమె బల్లదగ్గరగాని, ఇంట్లోగాని స్థలంలేదు యెవరికీ.

ఎవరో కన్నడం ఆయన ఆమెని ఆహ్వానించడానికి వొచ్చాడు, సారస్వత పరిషత్తులో ఉపన్యాసం ఇవ్వడానికి. ఆమె కన్నడ సాహిత్యం సంగతి అడుగుతోంది ఆయనని.

"అయితే మీ జాగీర్దార్ మా చలం అన్నమాట" అన్నాడు శంకర్.

"అవును. చాలా పోలిక ఉన్నాయి" అని ఆమెతో - "మీ వంటి స్త్రీలు మా దేశంలో అరుదు. నవీన భావాలకు మా రచయితలు చాలా గర్వపడతారు మిమ్మల్ని చూసి" అన్నాడు.

ఆమె నవ్వింది. "నాదంతా పైకి వేషాలలో పద్ధతులలో నవీనమే. నా భావాలన్నీ చాలా పురాతనం."

"ఏ విషయంలో?"

"ముఖ్యం ప్రేమ విషయంలో."

"పాత పాతివ్రత్యం అదేనా? ఇంకా వివాహ పద్ధతుల్లో కూడానా?"

"జరిగేవి జరుగుతున్నాయి. ఏం జరిగినా, పురాణాలూ, నీతులూ అలా వుంచి, అసలు సభ్యం అశభ్యం అనేది ఒకటి వుందిగా. ఆ రెంటికీ భేదం లేదన్నప్పుడే నా తగాదా."

"కాని ఆ భేదం కూడా మనిషి అభిప్రాయం మీదనే ఆధారపడ్డది కదా? మీ దృష్టే ప్రతివారికీ వుండాలని ఏముంది?" అన్నాడు శంకర్.

"అభిప్రాయ భేదాల కేం! ఎవరిపీలు మబట్టి వారి అభిప్రాయాలు మారుతూ వుంటాయి. వ్యభిచార దృష్టి బలంగా ఉన్న మనిషి, నైతికాభిప్రాయాలు వంకర కాక ఏం చేస్తాయి?"

"కాని సాంఘిక పరిస్థితులో? అందరు స్త్రీలకూ మీకున్న నిగ్రహశక్తి వుంటుందా?" అన్నాడు శంకర్.

ఆ మాటలకు ఆమె చాలా గర్వపడ్డది. ఆమె సెక్రటరినించి ఆ మాటలు గొప్ప చెప్పి మోనియల్.

"ఉండదు. నాకు మాత్రం వుందని ఏమిటి? నాదీ శరీరమే. కాని తక్కిన పట్లు బలంగా పని చెయ్యాలి అంటాను."

"కాని ఆ తక్కిన పట్ల అవసరం, అర్థం, న్యాయం, ప్రశ్నిస్తున్నారు రచయితలు" అన్నాడు ఆయన.

ఆ మాటలతో ఆయన పరిశత్తుకి ఆమె వెళ్లే ఛాన్సును పోగోట్టుకున్నాడు.

"ఆ పట్లల్లో, అభ్యంతరాల్లో అర్థం, న్యాయం, వుండ వొచ్చు,

వుండకపోవచ్చు కాని ఆ నిబంధనలు స్వంతజీవితాలపైన ఏర్పరచు కున్న మనుషులు ఎంత ఉన్నతులో, వారి ఆత్మ బలం ఎంత బలీయమో గమనించనక్కర్లేదా?" అన్నాడు శంకర్.

ఆ మాటలు ఆమెని పొగడడానికి అనలేదు అతను. నిజంగా ఫీల్ అయ్యే అన్నాడు. ఆ మాటతో ఆమె కళ్ళు మెరిశాయి.

"ఆ ఔన్నత్యం ఎంత మోసమో చూపుతో చాలా కథలు బయలుదేరాయి, మీ తెలుగులోనే" అన్నాడు ఆయన.

ఆ మాటలు ఆమె వినిపించుకోక ఆయన్ని పూర్తిగా ఉపేక్ష చేసింది అటు తరవాత.

మళ్ళీ ప్రచారానికి బయలుదేరారు. శంకర్‌కీ ఆమెకీ చనువు ఎక్కువయింది. అధికారిణీ స్వరూపం తగ్గిపోయింది ఆమెలో. అక్కా తమ్ముడూ అయినారు వాళ్ళు. మీటింగు అయిన తరవాత రాత్రి అతని దగ్గిరకొచ్చి కూచుంటుంది. జ్వరం కాగానే అతని చంపలు రాపింది ఓ సారి. చాలా పరియాచకా లాడుతుంది. ఆమెకి అతను ఎంత సేవ చేస్తాడో, అంత సేవా అతనికి చేస్తోంది, భోజనంలో అతనికి ఏ మిష్టమో, అతనికి అన్ని సదుపాయాలూ జరుగుతున్నాయో లేదో కనుక్కుంటుంది. ఆమెని భోజనానికి ఆహ్వానించి అతన్ని ఆహ్వానించకపోతే వొప్పుకోదు.

"మా శంకర్నో!" అంటుంది.

ఆమె మనసులో అతనిమీద అభిమానం ఎక్కువైన కొద్దీ పబ్లిక్‌లో అతనికి గౌరవం తగ్గుతోంది. ధనికురాలు ఉంచుకున్న దొంగ ప్రియుణ్ణి చూసినట్టు హీనంగా తనని చూస్తున్నా రనిపించింది అతనికి.

కొద్దిరోజుల్లో అతనికి చాలా స్పష్టమయింది, ఆమె తనని కోరుతోందని. ఇన్నాళ్లూ ఆమె ఎంత చనువు తీసుకోనీ, అతనికి ధైర్యంలేదు ఆమెతో తాను చనువు తీసుకోడానికి. తనంతట తాను ఆమె చేతినికూడా తాకలేదు. అప్పుడప్పుడు కారులో ఆమెతో కూచుని, వూపుకి ఆమెమీద వొరిగాడు, అంతే. కాని ఆమె తనకి కావాలా?

కావాలి. కాని ఆమె తన దవుతుందన్న ఆలోచన యెందుకో పెద్ద సంతోషాన్ని ఇవ్వలేదు. ఎందుకో!

రాత్రులు అప్పుడప్పుడు ఆమెకి నిద్రపట్టక అతన్ని తన గది లోకి పిలిచి కబుర్లు చెప్పమనేది. చదివించుకునేది. మెడవరకు కప్పు కున్న ఆమె ఒంటిమీద ఏంతమాత్రం బట్టలున్నాయో అని అతని క్యూరియాసిటీ. ఒక్కొక్క రాత్రి మంచం పక్కన ఉన్న కుర్చీలోంచి ఆమెమీదికి ఒంగాలని చాలా బలంగా ఆవేశం ఒచ్చేది. తన గదిలోకి వెళ్ళి పడుకున్న తరవాత తా నెంత పిరికివాడా అని చాలా కోపం కలిగేది.

అందమైన ఆ గది, నీలంగా సన్నని వెలుగు పడేసే ఆ దీపంలో ఆమె ఆ పెద్ద పట్టుదిళ్ళ మంచం, కిటికీలోంచి తోట అందం, మెరిపి నిరీక్షించే నక్షత్రాలు, రేరాణీ పూల పరిమళాలు,వాన చినుకులు పడుతూ వుంటే నేలలోంచి బద్దలై కమ్ముకునే సృష్టి శక్తి సౌరభం, ఆ నీలం కాంతిలో దిండుమీద పరుచుకున్న ఆమె జుట్టు తరంగాలు, చంపకింద కనపడే కంఠం, ఆ పల్చని పట్టుదుప్పటిని పైకి తోసు కుంటో తన కళ్ళకింద ఎదుగుతున్నట్టు కనపడే ఆమె రొమ్ము చివర్లు ఆమె తొడలవాలు-ఎట్లా నిలవగలిగాడో ఆ యువకుడు పాపం!

అతను కావాలని కాకపోతే, ఎందుకు తన గదిలోకి రాత్రులు పిలుస్తుంది? కాని ఆ సమయాలలో ఆమె మొహం గంభీరంగా అధికారంగా వుంటుంది. వింటుంది. కాని మాట్లాడదు. అతనివంక చూడనన్నా చూడదు. ఎంత ప్రయత్నించీ ఆ అరంగుళాల దూరం తన మనసులోకాని, మాటలోగాని దాటి చేతిని జాచలేదు. "వీల్లేదు - ఏ మాత్రం వీల్లేదు" అన్న ఒక వాతావరణం, ఒక శక్తి, ఆమె లోపలినుంచి బయలుదేరి అతన్ని వెనక్కి నెడుతోం దనిపించింది. రోజంతా అతన్ని పిలుస్తుంది ఆమె దేహం. ఆమె ఇష్టానికి తిరగ బడా? కాని రాత్రి ఆ గదిలో మాత్రం అతనికి పూర్తిగా విరోధం.

రాత్రులు తన పక్క మీద పడుకుని, ఆమెని తలుచుకుని,అతని మనసూ దేహమూ కూడా నీరసపడి పోతున్నాయి. ఏమో, ఏ రాత్రో ఆమె తన గదిలోకి రాకూడదా అని యెదురు చూసి చూసి నిద్రరాదు.

కాని ఆమె మీద అతనికి ఇష్టంలేదు. ఉత్త యవ్వనం. రక్తం రక్తానికి పిలుపు. ఆ పిలుపులోంచి పెద్ద యిష్టం ఉద్భవం కావాలి సహజంగా. కాని ఆమె విరోధం. ఎక్కడి కక్కడికి ఆమెలోని ఆకర్షణని పెరగనీకండా తుంచేస్తున్న విరోధం, నిర్లక్ష్యం, వెక్కిరింపు. ఆమె దేహం పిలుస్తుంది. ఆమె మనసు పొమ్మంటుంది. మనసుకే విజయం.

ఆమె సుఖంగానే వుందిగాని. శంకర్ చిక్కిపోతున్నాడు. ఆమె కూడా ప్రశ్నిస్తోంది దయగా, 'ఆరోగ్యం బావుండలేదా,' అని. తన జ్ఞాతి చిక్కిపోయి తనని వారన్ చేసిన సంగతి జ్ఞాపకం వొచ్చింది. ఈ అవస్థ అతనూ పడ్డాడా? అందుకనే క్షయ రోగిలాగైనాడా? తన గతీ అంతేనా? చివరికి పీనిగై శక్తి లేనివాడు ఇంకో సెక్రటరీ కావాలని పత్రికల్లో వేస్తుందా ఈ మహాకాళి!' తను ముందే యెందుకు వెళ్ళిపోకూడదు? వెళ్ళలేడని అతనికి చాలా స్పష్టంగా తెలుసు. జీతం, భోగం. అంతే కాదు. ఆమెని విడిచి వుండలేడు.

ఓ రాత్రి అతనికి చాలా రోషం వొచ్చింది. ఏమిటి? తనెందుకు ఇట్లా నలిగిపోవాలి? తన కేమిటి ఆ భయం? ఏం మహాగొప్ప! ఆడది కాదా? తనని ఈ విధంగా నాశనం చేస్తో వుంటే, తానేం అంత చాతగాని వాడా? అని యెంతో చెప్పుకున్నాడు. మర్నాడు రాత్రి కూచున్నాడు చదువుతో, ఏదో కళమీద ఒక రష్యను రాసిన పుస్తకం. తనలో పెరుగుతున్న రోషం అతని కంఠం పట్టుకుంది. మాట తడబడుతోంది. ఆమె తల తిప్పింది అతని వేపు.

"ఏమిటి? వొంటో బావుండలేదా?"

"ఊ."

"ఏమిటి?"

"రాత్రులు నిద్రలేదు."

"ఆ బల్ల మీద నిద్ర మాత్రలు వున్నాయి. తీసుకు వెళ్ళు."

"అది కాదు."

"ఏమిటి?"

ఆమె కంఠంలో ఏమీ దయలేదు. భయంలేదు. ఉత్తవిరోధం. ఎంతో దూరం.

ఆమె కళ్ళల్లోకి చూస్తో వూరుకున్నాడు. ఆమె కోపంగా మండి పడుతో చూస్తోంది అతని వంక.

'సాహసించు. సాహసించు. ఏమిటి భయం?' అంటున్నారు ఎవరో అతని లోపల. కాని చెయ్యి కదలదు.

అంత మండిపడే మనిషిని ఎవరేం చెయ్యగలరు? ఎన్నో చేతులతో అతన్ని తలుపువేపు తోసేస్తోంది ఆమె.

చాలా నీరసంగా సంకోచంగా ఆమె వేళ్ళ కొనల్ని తాకాడు. తన వేళ్ళని ఓ క్షణం అట్లానే వుంచాడు. దానికోసమే యెదురు చూస్తున్నట్టు ఆమె చివాలున లేచి కూచుంది. దుప్పటి కిందికి జారిన ఆమె బట్టలేని బుజాలు, ఆ బుజాల కింద నీలం కాంతిలో ఓ పక్క మెరుస్తో వెలుగులో అతని చూపులు అతుక్కుని పోయినాయి.

ఆమె బిగ్గరగా నవ్వింది.

"వెళ్ళు. వెళ్ళిపో. ఏమిటీ వేషాలు! వెళ్ళవేం?" నిజంగానే అంటోంది.

ఏం చేస్తాడు? తలవొంచుకు వెళ్ళిపోయినాడు తన గదిలోకి.

ఆ రాత్రి నించి ఆమె మీద తాచుపాము పగపట్టాడు శంకర్. ఎన్నటికీ మరవలేని అవమానం. తనని ఆకర్షించి గదిలోకి పిలిచి - అది ఆడది కాదు-రక్తాలు పీల్చే భూతాలు నయం దీనికన్న. కానీ దీని పని రేపు రాత్రి! అనుకున్నాడు. మర్నాడు ఆమె మామూలుకన్న దయగా వుంది అతని మీద. కాని ఆ రాత్రినించి అతన్ని గదిలోకి పిలవలేదు.

అతని ప్లాన్స్ భగ్నమైనాయి. ఇంక ఆమె నేం చేస్తాడు?వారం రోజులయింది. అతని కసి ఏ మాత్రం తగ్గలేదు. ఆమె మీద విరోధం అతనికి. ప్రతిమాటలో ఏదో ఒకటి అంటున్నాడు, ఆమెని. కాని రోజు రోజూ ఆమెకి దయ ఎక్కువౌతోంది. ఏమో టానిక్కులు తెప్పించి స్వయంగా ఇప్పిస్తోంది అతనికి. విలువైన బట్టలు కుట్టించింది.

ఆనాటి మధ్యాన్నం. లైబ్రరీలో చదువుకుంటున్నాడు, జహ్వర్

లాల్ స్వీయ చరిత్ర. చాలా శాంతంగా వుంది. వానకురిసి వెలిసి ఆకాశంలో ఏర్పడ్డ సరోవరాల్లోంచి బైలుదేరి వస్తోంది గాలి. ఎంత గంతు లేస్తో వొచ్చి ఆడుతోంది చెట్ల ఆకుల మీద నీటితో. పిట్టలన్నీ బైటకి వొచ్చి కిలకిల మంటున్నాయి.

ఆమె వొచ్చింది లైబ్రరీలోకి. అతన్ని చూడలేదు. ఏదో పుస్తకం వెతికి తీసుకుంది. అతను తలెత్తలేదు. వెడుతో అతన్ని చూసింది. దగ్గిరికి వొచ్చి "ఏమిటి? చదువుతున్నావు? ఓ! ఇల్లాంటి మధ్యాన్నం ఈ అందంలో యువకుడు చదవ వలసిన పుస్తకమేనా?"

అని తన చేతిలోని పుస్తకం బల్లమీద పెట్టి వెళ్ళి ఇంకో పుస్తకం తెచ్చి. తెరిచి వెతికి చూసి, నవ్వుతో అతనికిచ్చింది. బట్టలు లేని ఫ్రెంచి బొమ్మలు.

"అవి చదువు. నీ భార్యకి ఉపయోగం" అని నవ్వి, అతని జుట్టుని వూయించి వెళ్ళిపోతోంది అతనింక నిలవలేదు. తోకతొక్కిన తాచుపాము మల్లే లేచాడు.

"ఆగు" అన్నాడు అధికారంగా.

చప్పున కోపంగా తిరిగింది అతని వేపు. ఎంత తృణీ కారం! దాంతో అతని రక్తం విషం అయింది. భగ్గుమన్నాయి మంటలు గుండెల్లో. నిలువునా జ్వాలామయ మయింది.

ఒక్క దూకులో ఆమె మీద పడ్డాడు. ఆమెతో సహా తివాసీ మీద పడ్డాడు. ఆమె పమిట బాడీస్ చింపేశాడు. ఆమె పెదిమలోంచి రక్తం కారుతోంది. కళ్ళు మండిపోతున్నాయి. ఏదో తిడుతోంది. కాని అతన్ని ఆమె ఒళ్ళు లాగేసింది, ఏమీ విరోధపడలేదు.

ఆమెని తివాశీ మీద అట్లానే వొదిలి, వెళ్ళి తన కుర్చీలో కూచున్నాడు వగురుస్తో. ఆమె లేచి కూర్చుని నెమ్మదిగా సర్దుకుని, అతనివంక చూడకుండానే లేచి వెళ్ళిపోయింది.

మర్నాటినుంచి ఆమె అతనితో మాట్లాడడం మానేసింది. వారం రోజు లయింది. అతని కేం పశ్చాత్తాపం రాలేదు.

ఓ ఉదయం కాఫీ కాగానే షాఫరు వొచ్చి "రండి" అన్నాడు.

"ఎక్కడికి?"

"ఏమో! అమ్మగారు రమ్మన్నారు" అని కారు దగ్గిరికి తీసి కెళ్ళారు. తన పాతపెట్టె, జంపఖానా చుట్ట వున్నాయి కారులో. అత న్నడిగి వాచీ, పెన్నూ తీసుకున్నాడు నౌకరు. వరండాలో పది మంది యువకులు కూచుని వున్నారు.

కారులో స్టేషన్‌కి తీసికెళ్ళి అతని వూరికి సెకండు క్లాసు టిక్కెట్టుకొని యెక్కించారు. చేతులో ఒక కవరు పెట్టి వెళ్ళిపోయి నారు. ఆ కవరులో వెయ్యిరూపాయలకి చెక్కు.

———